# కళతప్పిన ఆంధ్ర కాల్వ

- మట్టి, ఇసుకతో పూడుకుపోతున్న వైనం
- కనీస మరమ్మతులూ లేవు
- సాగునీటి పారుదలకు ఆటంకం
- రైతుల ఆందోళన



మండలంలో ముళ్ల పొదలు, మట్టి, ఇసుకతో పూడుకుపోయిన ఆంధ్ర కాల్వ

**చింతలపూడి :** ఖమ్మం జిల్లా బేతుపల్లి చెరువు నుంచి రైతులకు సాగు నీరు అందించే ఆంధ్ర కాల్వ క్రమేపీ కనుమరుగవుతోంది. రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. చింతలపూడి మండలంలోని 21 చెరువులకు సాగు నీరు అందించేందుకు 1967లో ఖమ్మం జిల్లా తుమ్మూరు వద్ద ఆనకట్ట నిర్మించారు. అక్కడి నుంచి ఆంధ్ర కాల్వ ద్వారా వరద నీటిని మండలంలోని సాగునీటి చెరువులకు మళ్లిస్తారు. మండలంలో దాదాపు 11 వేల ఎకరాలకు పైగా ఏటా సాగునీరు అందుతుంది. రాష్ట్ర విభజన తరువాత బేతుపల్లి చెరువు అలుగు ఎత్తు పెంచి అక్కడి నీరు కిందికి రాకుండా తెలంగాణ రైతులు, అధికారులు అడ్డుకుంటున్నారు. కనీసం కాల్వను మరమ్మతులు చేసినా వర్షాకాలంలో వరద నీరు వచ్చే అవకాశం ఉంది. అయితే అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా ఆంధ్ర కాల్వ మట్టి, ఇసుకతో పూడుకుపోయి సాగు నీటి సరఫరాకు అంతరాయంగా మారింది. దీనికితోడు మైనర్ ఇరిగేషన్ పరిధిలోని ఈ కాల్వకు వర్షాకాలం సమయంలో అనేకసార్లు గండ్లు పడటం, మరమ్మతులు చేయడం ఆనవాయితీగా మారింది.

**పట్టించుకోని అధికారులు**

గత ఏడాది ఆయకట్టు రైతుల వినతి మేరకు ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు ఆంధ్రా కాల్వ మరమ్మతులకు తన పార్లమెంట్ నిధుల నుంచి రూ.30 లక్షలు కేటాయించారు. ఆ నిధులతో కాల్వను సుమారు నాలుగు కిలో మీటర్ల మేర మరమ్మతులు చేసి కాల్వపై రెండు కల్వర్టులు కూడా నిర్మించారు. ఇంకా 14 కిలో మీటర్ల మేర పూడిక తీసి మరమ్మతులు చేయాల్సి ఉంది. రైతులు, ప్రజలు ఎప్పటికప్పుడు విజ్ఞప్తి చేస్తున్నా ఆంధ్ర కాల్వను అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. గతంలో కూడ సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు గండి పూడ్చివేతలో లక్షలాది రూపాయలు దండుకుంటున్నారే తప్ప, పూర్తిస్థాయిలో శాశ్వత చర్యలు చేపట్ట లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిసారి ఇదే ప్రాంతంలో గండి పడుతుండటంతో కాంట్రాక్టర్లకు కాసుల పంటగా మారిందని విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు శాశ్వత ప్రాతిపదికన పటిష్టంగా మరమ్మతులు చేపట్టాలని, ఆంధ్ర కాల్వ పూడికతీత పనులను చేపట్టాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.



యండపల్లి వద్ద గతేడాది మాజీ ఎంపీ నిధులతో ఆంధ్ర కాల్వకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

**పూడిక తీయాలి**



ఆంధ్రకాల్వ పూడికతీసి కాల్వను నీరు పొలాలకు పారేలా అభివృద్ధి చేయాలి. ప్రతిఏటా గండి పడటం, మరమ్మతులు చేస్తున్నారు. కాల్వను అభివృద్ధి చేయక పోవడం వల్ల వరద నీరు వృథాగా పోతుంది. కాల్వలో పేరుకు పోయిన పూడికను తక్షణం తొలగించాలి.

– బొడ్డు వెంకటేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్, చింతలపూడి మండలం

## నిబంధనలు పాటించకుంటే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రవిచంద్ర

**జంగారెడ్డిగూడెం:** ఆటో డ్రైవర్లు నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని డీఎస్పీ యు.రవిచంద్ర ఆదేశించారు. జంగారెడ్డిగూడెంలో జంగారెడ్డిగూడెం మండల, పట్టణ ఆటో డ్రైవర్లకు ఏర్పాటుచేసిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. సురక్షిత ప్రయాణానికి బస్సు తరువాత అత్యంత ఎక్కువగా ప్రజలు ఆశ్రయించేది ఆటో అని, ఈ విషయాన్ని డ్రైవర్‌లు గుర్తించాలని అన్నారు. లైసెన్సుతోపాటు ఆటో ధ్రువీకరణ పత్రాలు ఫోర్స్‌లో ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఆటోల్లో లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేసుకోవడం, డ్రైవర్ ఇరువక్కల ప్రయాణికులను కూర్చోబెట్టుకోవడం నేరమన్నారు. స్కూల్ పిల్లలను తీసుకువెళ్లే వారు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో మద్యం సేవించడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మితిమీరిన వేగం వంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేసి, డ్రైవింగ్ లైసెన్సు రద్దు చేయిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ ఎంవీ సుభాష్, ఎస్సై షేక్ జబీర్, ట్రాఫిక్ ఎస్సై ఎం కుటుంబరావు, సిబ్బంది, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

**మద్యం తాగి వాహనం నడపడం నేరం**

**కామవరపుకోట:** వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని తడికలపూడి ఎస్సై పి.చెన్నారావు అన్నారు. మంగళవారం స్థానిక కొత్తూరు బస్టాండ్ ఎదురుగా సెంటర్లో వాహన తనిఖీలు నిర్వహించారు. రోడ్డు భద్రత నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. సరైన పత్రాలు లేని వాహనదారులపై కేసు నమోదు చేసి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్సై చెన్నారావు మాట్లాడుతూ మద్యం తాగి వాహనం నడపడం, హెల్మెట్ ధరించకపోవడం చట్టరీత్యా నేరమన్నారు. వాహనాలకు సంబంధించి అన్ని పత్రాలు కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## వైఎస్సార్ సీపీ చింతలపూడి మండల అధ్యక్షుడిగా రమేష్‌రెడ్డి



శీలపురెడ్డి రమేష్‌రెడ్డి

**చింతలపూడి :** వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ చింతలపూడి మండల అధ్యక్షులుగా ప్రగడవరం గ్రామానికి చెందిన శీలపురెడ్డి రమేష్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం తాడేపల్లి కేంద్ర కార్యాలయం నుంచి ఆయనకు ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా రమేష్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## మానవ తప్పిదాలతో పర్యావరణ ప్రమాదాలు



పర్యావరణ ప్రమాదాలపై ఏర్పాటుచేసిన సెమినార్

**జంగారెడ్డిగూడెం:** మానవ తప్పిదాలే పర్యావరణ ప్రమాదాలకు కారణమవుతున్నాయని న్యాయవాది అచ్యుత శ్రీనివాసరావు, ఆధ్యాత్మికవేత్త కేఎల్ఏ ధనకుమార్‌లు అన్నారు. స్థానిక శ్రీరామచంద్ర డిగ్రీ కళాశాలలో చైర్మన్ బీవీ కృష్ణారావు అధ్యక్షతన పర్యావరణ ప్రమాదాల తులానాత్మక అధ్యయనం – విపత్తులను తగ్గించుకునే విధానాలపై సెమినార్ ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథులు శ్రీనివాసరావు, ధనకుమార్‌లు మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రకృతి వనరులను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారని, దీంతో సమతుల్యత దెబ్బతింటోందని వివరించారు. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో అనువుగాని వేళ భారీ వర్షాలు నమోదవడం, వేడి పెరిగిపోవడం, భూకంపాలు, సునామి తదితర భారీ పర్యావరణ ప్రమాదాలను మానవులు ఎదుర్కోవాల్సి వస్తోందని తెలిపారు. దీనిని అధిగమించేందుకు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. చైర్మన్ బీవీ కష్ణారావు మాట్లాడుతూ యువతకు అవగాహన పెంచేలా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పర్యావరణ ప్రమాదాలు, నివారించుకునే పద్ధతులపై పరిశోధన పత్రాలు సమర్పించి, వారి అనుభవాలను వివరించారు. పరిశోధన పత్రాలు సమర్పించిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సొలేషన్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ ఎంఎస్‌వీ సూర్యకుమారి, సీఈఓ టి.సురేష్, ఎం రాధిక, ఎం ఉమ, మౌనిక, టి.హిమబిందు, ఎ.బోస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ వీరాంజనేయులు

**జంగారెడ్డిగూడెం:** వార్డు ప్రజల సహకారంతోనే అభివృద్ధి చేసే అవకాశం వచ్చిందని కౌన్సిలర్ నేట్రు సుబ్బలక్ష్మి అన్నారు. స్థానిక 27వ వార్డులో పలు అభివృద్ధి పనులకు మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, కౌన్సిలర్ నేట్రు సుబ్బలక్ష్మి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు, సుబ్బలక్ష్మిలు మాట్లాడుతూ 27వ వార్డులో మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన లక్ష్మి సహకారంతో రూ.5 లక్షలు మంజూరు చేశారని చెప్పారు. వీటితో చేపట్టనున్న డ్రెయిన్ పనులకు శంకుస్థాపన చేశామన్నారు. మున్సిపల్ బోర్డులో గెలిచినప్పటి నుంచి పలు రోడ్లు, డ్రెయిన్లు నిర్మించామని, పట్టణ అభివృద్ధికి చైర్‌పర్సన్ అధ్యక్షతన పలు కార్యక్రమాలు చేశారని వివరించారు. నేడు పట్టణంలో ఎటు వెళ్లినా తాము చేసిన అభివృద్ధి కనిపిస్తోందని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ 30 సంవత్సరాల నుంచి జరగని అభివృద్ధిని కేవలం నాలుగేళ్లలోనే చేసిచూపించామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అయినాల వెంకటరమణమూర్తి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కర్పూరం గుప్తా, సీనియర్ నాయకులు బత్తిని చిన్న, జెట్టి ఆదిత్య, చిప్పాడా వెంకన్న, నేట్రు గణేష్ యాదవ్, స్థానిక ప్రజలు తీడా మహేష్, పాస్టర్ భాగ్య రావు, ప్రసాద్, నారాయణ, హనుమంత రావు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవం



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యువ నైపుణ్య దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

**జంగారెడ్డిగూడెం:** స్థానిక ఛత్రపతి శివాజీ త్రి శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ ప్రసాద్‌బాబు అధ్యక్షతన యువభారత్ ఏలూరు శాఖ, స్పార్క్ రూరల్ అండ్ ట్రైబల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువ నైపుణ్య దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైస్‌ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో యువత నైపుణ్యం పాత్ర ఎంతో ఉందన్నారు. ఒక దేశం అభివృద్ధి చెందాలంటే ఆ దేశం టెక్నాలజీతో పాటు వ్యక్తిగత నైపుణ్యం కూడా అభివృద్ధి చెందాలని అన్నారు. స్పార్క్ అసోసియేషన్ సెక్రటరీ త్రినాథ్ మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి తీర్మానం మేరకు అంతర్జాతీయ యువ నైపుణ్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రతి విద్యార్థి తమ వ్యక్తిగత నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ కేఆర్ఎస్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా యువత నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఎం నాగరాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ ద్వారా ప్రతినెల విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎం మధు, సీనియర్ అధ్యాపకులు యు.వెంకటాచార్యులు, కళాశాల ఉపాధి కల్పన శాఖ కోఆర్డినేటర్ బి.అశోక్ తదితరులు మాట్లాడారు. అధ్యాపకులు టీవీరాంబాబు, ఎం.శ్రీనివాసరావు, జె.రాజా శ్రీకాంత్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్లస్ టూ కళాశాలల ఏర్పాటుకు వినతి

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** ఏలూరు కార్పొరేషన్‌లో ప్లస్ టు కాలేజీల ఏర్పాటుకు కృషి చేయాలని ఏపీటీఎఫ్ ఏలూరు నగర శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే బడేటి చంటిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులకు పీఎఫ్ మినహాయింపు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రామారావు, నగర అధ్యక్షుడు కురమ ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సంపూర్ణ పారిశుద్ధ్యంపై అవగాహన



మతంగూడెంలో పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తున్న జెడ్పీ సీఈఓ శ్రీహరి

**లింగపాలెం:** గ్రామాలు చెత్తరహితంగా, పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని జెడ్పీ సీఈఓ ఎం శ్రీహరి అన్నారు. లింగపాలెం మండలం మతంగూడెం గ్రామ పంచాయతీని మంగళవారం ఆయన సందర్శించి, అమలవుతున్న శానిటేషన్ పనులను పరిశీలించారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించడం, ఐవీఆర్ఎస్ కాల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించడం, ఎస్‌డబ్ల్యూపీసీ పనులు, ఎస్ఎస్‌జీ 2025 సిటిజన్ ఫీడ్‌బ్యాక్ పనులను పరిశీలించారు. ప్రజలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, ఆర్థికంగా పురోగతి చెందుతారని, ప్రభుత్వం చేపట్టినటువంటి ఈ కార్యక్రమాన్ని గ్రామ స్థాయి ఉద్యోగులు మండల స్థాయి అధికారులు అందరూ కలిసి సమష్టిగా పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.వాణి, డిప్యూటి ఎంపీడీఓ ఎ.సుందరి, పంచాయతీ కారుదర్శులు పాపయ్య, సుగుణరాజు, రాజు, బి.బాలకృష్ణ, పంచాయతీల సిబ్బంది పాల్గొన్నారు.

### చల్లగా చూడు దుర్గమ్మ

**బుట్టాయగూడెం:** అమ్మా.. దుర్గమ్మా తమకే కష్టం రాకుండా చల్లగా చూడమ్మతల్లి అంటూ భక్తులు మొక్కులు తీర్చుకుని దుర్గమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఆషాఢమాసం చివరి మంగళవారం కావడంతో బుట్టాయగూడెం మండలం కొమ్ముగూడెం శివారు మర్లగూడెం దట్టమైన అడవిలో కొలువై ఉన్న కనకదుర్గమ్మవారిని భక్తులు మంగళవారం ఉదయం నుంచే దర్శించుకున్నారు. చీర, రవికలు, గాజులు సమర్పించి పసుపుకుంకుమలతో అమ్మవారిని పూజలు చేశారు.

### పిల్లల్ని డిగ్రీ వరకు చదివించాలి



మసీదులో సమావేశమైన ముస్లిం జేఏసీ నాయకులు

**కొయ్యలగూడెం:** ముస్లిం సమాజం తమ పిల్లల్ని డిగ్రీ వరకు చదివించాలని జంగారెడ్డిగూడెం ముస్లిం జేఏసీ సభ్యులు పిలుపునిచ్చారు. కొయ్యలగూడెం మసీద్‌లో మసీదు పెద్దలతో జంగారెడ్డిగూడెం జేఏసీ సభ్యులు మంగళవారం సమావేశం నిర్వహించారు. జేఏసీ నాయకులు షేక్ ముస్తఫా మాట్లాడుతూ ముస్లిం సమాజంలో చదువుకున్న వారు తక్కువగా ఉండటం వల్ల అన్ని రంగాల్లో వెనకబాటుతనానికి గురి అవుతున్నారని తెలిపారు. రాజకీయ ప్రాధాన్యత తక్కువగా ఉందన్నారు. చాలా గ్రామాల్లో ముస్లింలు ఎక్కువ సంఖ్యలో ఉన్నప్పటికీ కనీసం రాజకీయంగా వార్డు మెంబర్లుగా కూడా గెలవలేని పరిస్థితి ఉందని తెలిపారు. ఇంటింటా సర్వే చేసి డ్రాప్ అవుట్ స్టూడెంట్స్ లేకుండా చూడాలన్నారు. పిల్లలను చదివించే విషయంలో జంగారెడ్డిగూడెం ముస్లిం జేఏసీ అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో షేక్ ముస్తఫా, షేక్ బాజీ, షేక్ యాకూబ్, షేక్ నజీర్ భాష, షేక్ ఆదిల్, షేక్ సాజిద్, మహమ్మద్ నబీ, అబ్దుల్ షాహిన్, సయ్యద్ అన్వర్, షేక్ జహంగీర్, సయ్యద్ రంజాన్, షేక్ ఫరీద్, షేక్ షరీఫ్, షేక్ జిలాని, షఫీ, సయ్యద్ సమీమ్, సయ్యద్ జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

### పంట తెచ్చుకోకుండా చేశారు!



సమావేశమైన గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతులు

**టి.నరసాపురం:** గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి ముందే రైతులకు పొలాల్లోకి వెళ్లటానికి గ్రావెల్ రోడ్లు వేస్తామని, హైవే పక్కన సర్వీసు రోడ్డు వేస్తామని చెప్పి నేడు కనీసం తమ పొలాల్లో నుంచి పంట తెచ్చుకోవడానికి వీలు లేకుండా చేశారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. టి.నరసాపురం మండలం మక్కినవారిగూడెంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే వద్ద రైతులు సమావేశం నిర్వహించారు. గ్రీన్ ఫీల్డ్ హైవే వారు ఇచ్చిన మాట ప్రకారం తమ పొలాల్లోకి వెళ్లడానికి రోడ్డు, పంట బయటికి తెచ్చుకోవడానికి సర్వీస్ రోడ్డు వెంటనే వేయించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు త్వరలో ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు రైతులు తెలిపారు. టి.నరసాపురం మండల కేంద్రానికి ఎగ్జిట్ రోడ్డు ఇవ్వాలన్నారు. దీనిపై మండలంలోని రైతులందరూ త్వరలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టడానికి సిద్ధంగా ఉంటున్నామని స్పష్టం చేశారు.

### జూదరుల అరెస్ట్

**టి.నరసాపురం:** మండలంలోని సింగరాయపాలెం గ్రామ శివారులో పేకాట శిబిరంపై మంగళవారం దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని, రూ.40,500 నగదు, 12 మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై ఎం.జయబాబు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

## క్లుప్తంగా

### ఆత్మీయ కలయిక



వైఎస్ జగన్‌తో సత్యనారాయణ

**కామవరపుకోట:** వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాయింకుల సత్యనారాయణ తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ పలు సూచనలు చేసినట్టు చెప్పారు.

### చిన్నారికి నామకరణం చేసిన వైఎస్ జగన్



చిన్నారికి నామకరణం చేస్తున్న మాజీ సీఎం జగన్

**ద్వారకాతిరుమల:** మండలంలోని సత్తాల పంచాయతీకి చెందిన వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షుడు కొండాబత్తుల గిరి (కేజీఆర్) కుమారుడికి మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం నామకరణం చేశారు. వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో జగన్‌ను కేజీఆర్, జ్యోతి దంపతులు మర్యాద పూర్వకంగా కలిశారు. వారి కోరిక మేరకు వారి కుమారుడికి కెవిన్ అని జగన్ నామకరణం చేశారు.

### మధ్యవర్తిత్వంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న జడ్జి మధుబాబు

**చింతలపూడి :** మధ్యవర్తిత్వం వల్ల కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతాయని జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ మధుబాబు అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 10 నుంచి 16వ తేదీ వరకు మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం స్థానిక కోర్టు ఆవరణలో మధ్యవర్తి న్యాయవాదులు, పానల్ న్యాయవాదులు, కక్షిదారులకు అవగాహన కల్పించారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ చేసుకోవచ్చని జడ్జి మధుబాబు తెలిపారు. కార్యక్రమంలో మధ్యవర్తిత్వ న్యాయవాదులు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మాణిక్యాలరావు, న్యాయవాదులు కోర్టు సూపరింటెండెంట్ గురునాయుడు పాల్గొన్నారు.

### పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్చండి



పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని నినదిస్తున్న దృశ్యం

**లింగపాలెం:** ప్రభుత్వ పాఠశాలలు పిల్లల బంగారు భవితకు తొలిమెట్టని బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించాలని కోరుతూ సింగగూడెం గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేశారు. సింగగూడెం మోడల్ ప్రైమరీ స్కూల్‌లో చేర్పి నాణ్యమైన విద్యను పొందాలని ఎంఈఓ కె.రామారావు, హైస్కూల్ హెచ్ఎం పువ్వుల ఆంజనేయులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులను కోరారు.

### సుబ్రహ్మణ్యుడికి పూజలు

**జంగారెడ్డిగూడెం:** గుర్వాయిగూడెం శ్రీ హరిహరసుత అయ్యప్ప స్వామి ఉపాలయమైన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి మంగళవారం సందర్భంగా పంచామృత అభిషేకాలు అర్చకులు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

### ఓటర్ల జాబితాలో తప్పలకు చోటివ్వవద్దు



శిక్షణలో మాట్లాడుతున్న తహసీల్దార్

**బుట్టాయగూడెం:** తప్పులు లేకుండా ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని తహసీల్దార్ పీపీ చలపతిరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఓటర్ల జాబితా తయారీపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కలెక్టర్, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 2025 ఓటర్ల జాబితా తయారీకి బీఎల్ఓలతో శిక్షణ ఇస్తున్నట్టు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని బీఎల్ఓలు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**జంగారెడ్డిగూడెం:** మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత నిమిత్తం స్థానిక మెట్టమీద సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. బైపాస్ రోడ్డు, ఉప్పల మెట్ట, గవర్నమెంటు హాస్పిటల్ ఏరియా, సుబ్బంపేట, ముత్యాలమ్మ, రాజీవ్‌నగర్, ఎన్‌టీఆర్ నగర్, గరుడపక్షి కాలనీలోని అన్ని రకాల సర్వీసులకు, నిమ్మలగూడెం సబ్ స్టేషన్ పరిధిలో 24 గంటల లైన్ వేసేందుకు కట్టవపాదలగూడెం గ్రామానికి వ్యవసాయ, గృహ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

## విద్యుత్ బిల్లులు ప్రభుత్వమే చెల్లించాలి

**కొయ్యలగూడెం:** టైలర్ల షాపులకు వచ్చే విద్యుత్ బిల్లులు ప్రభుత్వం కట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ టైలర్ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి డిమాండ్ చేశారు. స్థానిక వినాయకుని ఆలయం వద్ద మంగళవారం టైలర్ల సంఘ సభ్యులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెడీమేడ్ వస్త్ర ప్రపంచం పోటీని తట్టుకోవడం టైలర్లకు కష్టతరంగా మారిందన్నారు. టైలర్ల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## పుంత రోడ్డు తవ్వకాన్ని అడ్డుకున్న రైతులు

**ద్వారకాతిరుమల:** స్థానిక యాదవ కల్యాణ మండపం పక్కనుంచి ఉన్న ద్వారకాతిరుమల – మలసానికుంట పుంత రోడ్డు తవ్వకాన్ని రైతులు అడ్డుకున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. ఈ పుంత రోడ్డును 80 ఏళ్లుగా ఈ ప్రాంత రైతులు వినియోగిస్తున్నారు. దెందులూరు మండలం చల్లచింతలపూడికి చెందిన ఓ వ్యక్తి యాదవ కల్యాణ మండపం నుంచి అరకిలో మీటరు దూరంలో రోడ్డును జేసీబీతో తవ్వేందుకు ప్రయత్నించాడు. దీంతో రైతులు అడ్డుకున్నారు. సదరు వ్యక్తి తాను బిల్‌మగతాగా కొనుగోలు చేసిన భూమిలో ఈ రోడ్డు ఉందని, అందుకే దీన్ని తవ్వి, పక్క నుంచి రోడ్డును నిర్మిస్తానని చెప్పుకొచ్చాడు. అక్కడికి వచ్చిన విలేజ్ సర్వేయర్ రోడ్డు తవ్వుతున్న వ్యక్తికి మద్దతుగా మాట్లాడటంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వేయర్, వీఆర్వో మహాలక్ష్మి అక్కడి నుంచి వెళ్లిపోయారు. జేసీబీతో సహా సదరు వ్యక్తి వెళ్లిపోయాడు. రెవిన్యూ అధికారుల అండదండలతోనే రోడ్డు తవ్వకాలు జరుగుతున్నాయని, తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

## ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వరి నాట్లు



ఇంద్రాణి రకం వరి నారు నాట్లు వేస్తున్న దృశ్యం

**చింతలపూడి :** ప్రకృతి వ్యవసాయానికి రైతుల్లో ఆదరణ పెరుగుతోందని డిజిటల్ ఫెసిలిటేటర్ మరికంటి గోపాలకృష్ణ అన్నారు. చింతలపూడి మండలం ఎండపల్లి గ్రామంలో మంగళవారం రైతు జగ్గయ్య పొలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో దేశీ వరి ఇంద్రాణి రకం నారు నాట్లు వేశారు. నారును కొసలు తొలగించి నాట్లు వేయడం, లైన్ టు లైన్ పద్ధతుల్లో నాటడం వంటి ప్రకృతి విధానాలను పాటించారు. కొసలు తొలగించి నాట్లు వేయడం వల్ల మొక్కల పైభాగంలో ఉండే పురుగులు, క్రిమిసంహారకాలు తొలగిపోతాయని గోపాలకృష్ణ తెలిపారు. లైన్ టు లైన్ నాట్లు వల్ల సౌకర్యవంతంగా నీటి పర్యవేక్షణ, నిండు పిలకల ఏర్పాటుతో పాటు అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఏఎ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

### ప్రకటన

[illegible]